క్లుప్తంగా

అయ్యప్ప ఆలయానికి రూ.5 లక్షల విరాళం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయానికి ప్రముఖ శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి రూ.5లక్షల18 వేలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయ్యప్ప స్వామి కరుణ కటాక్షాలు మండల ప్రజలకు నిరంతరం ఉండేలా తాను భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొప్పుల గంగారెడ్డి, అయ్యప్ప సేవాసమితి సభ్యులు గురుస్వామి రాజు, వీరయ్య పాల్గొన్నారు.

వాసవి క్లబ్ అధ్యక్షుడిగా చింతల రాజేష్



దోమకొండ: దోమకొండ వాసవి క్లబ్ అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన చింతల రాజేష్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఎన్నికలు నిర్వహించారు. కార్యదర్శిగా లింగ శ్రీకాంత్, కోశాధికారిగా రేఖ నవీన్‌లను ఎన్నుకున్నారు. వాసవీక్లబ్ అభివృద్ధికి పాటుపడతానని ఈ సందర్భంగా చింతల రాజేష్ తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు గజవాడ శ్రీకాంత్, చిన్న రవి, కస్ప ప్రశాంత్, తాటిపల్లి శ్రీధర్, తాటిపల్లి శ్రీకాంత్, చింతల వెంకన్న, చేపూరి సంతోష్, సురేష్, ముక్క శ్రీను, కొండూరి లక్ష్మణ్, ఎర్రం రాజు పాల్గొన్నారు.

బోరుమోటారు బిగింపు



దోమకొండ: అంబారిపేటలో ఆదివారం ఎంపీటీసీ నిధులతో బోరుమోటారును బిగించినట్లు ఎంపీటీసీ సభ్యులు పిరంగి రాజేశ్వర్ తెలిపారు. స్థానిక కెనరా బ్యాంకు ముందు బోరు వేసి మోటార్ బిగించినట్లు వివరించారు. గ్రామ సర్పంచ్ ఎండీ సలీం, ఉప సర్పంచ్ సరికొండ వనిత, గ్రామస్తులు ఉన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయానికి గ్రామ పంచాయతీల నుంచి రావాల్సిన బకాయిలను చెల్లించాలని గ్రంథ పాలకుడు రాజలింగం కోరుతున్నారు. అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాలు ఇండ్ల వినియోగదారుల నుంచి వసూలు చేసిన ఇళ్ల బిల్లుల నుంచి 8 శాతం గ్రాంటును గ్రంథాలయానికి చెలించాల్సి ఉంటుందన్నారు. 18 గ్రామపంచాయతీలకు గాను గ్రంథాలయానికి సుమారు రూ.8 లక్షల 50 వేల వరకు బకాయిలు రావాల్సి ఉందన్నారు. సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు చొరవ తీసుకొని పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించి గ్రంథాలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. గతంలో కూడా ఎన్నో సార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు పెండింగ్ వివరాలను తెలిపినప్పటికి ఎవరు స్పందించడం లేదని పేర్కొన్నారు.

మల్లన్న, బీరప్పలకు ప్రత్యేక పూజలు



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని బేగంపూర్‌లో మల్లన్న ,బీరప్ప దేవుళ్లకు గొల్ల కురుమల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాడిపంటలు చల్లంగా ఉంచాలని మల్లన్న దేవుని మొక్కుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): నెమ్లి గ్రామంలో గల కొచ్చరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరి కాయలు కొట్టి, నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

కానిస్టేబుల్‌కు అభినందనలు

కామారెడ్డి అర్బన్: రోడ్డు ప్రమాద బాధితుడి వద్ద లభించిన నగదును వారి కుటుంబసభ్యులకు అప్పగించిన కానిస్టేబుల్‌ను పలువురు అభినందించారు. గాంధారి మండలం తిప్పారం రోడ్డు వద్ద ఆదివారం జరిగిన ప్రమాదంలో లింగంపేట కొర్పోల్ గ్రామానికి చెందిన కర్రోల రవి(35) గాయాలపాలయ్యారు. బాధితుడ్ని హుటాహుటిన కామారెడ్డి జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలించారు. అపస్మారక స్థితిలో ఉన్న రవి వద్ద లభించిన రూ.71,620 నగదును ఆస్పత్రి డ్యూటీ కానిస్టేబుల్ లక్ష్మణ్ జాగ్రత్తగా కుటుంబసభ్యులకు అప్పగించారు. బాధ్యతతో అప్పగించినందుకు అభినందించారు.

ఆటలు నిల్.. విద్యార్థులు డల్!



క్రీడాపోటీల్లో పాల్గొన్న బోర్లం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు(ఫైల్)

- నాలుగు గోడల మధ్య నలిగిపోతున్న బాల్యం
- ఐదేళ్లుగా మండల క్రీడలకు దూరం
- మండల స్థాయిలో నిర్వహించకుండానే జిల్లా స్థాయిలో ఎస్‌జీఎఫ్ పోటీలు

బాన్సువాడ రూరల్: విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో, అటలు కూడా అంతే ముఖ్యం. క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల పోటీతత్వం, స్నేహభావం పెరగడంతో పాటు శారీరక, మానసిక ఎదుగుదల ఉంటుందనేది కాదనలేని వాస్తవం. ఈవిషయాన్ని అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు అవకాశం దొరికినప్పుడల్లా చెబుతుంటారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం అమలుకు చర్యలు తీసుకోకపోవడంతో విద్యార్థులు విద్యాబోధనకే పరిమితం అవుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిత్యం పుస్తకాలతో కుస్తీపడతూ నాలుగుగోడల మధ్య నలిగిపోతున్నారు. ఐదారు సంవత్సరాలుగా మండల స్థాయిలో క్రీడాపోటీలు నిర్వహించడం లేదు. ఈ పోటీలు నిర్వహించడం వల్ల పాఠశాల స్థాయి నుంచి మండల స్థాయికి, అక్కడి నుంచి జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటే అవకాశం కలుగుతుంది. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన వారికి స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్లు వర్తించే సర్టిఫికేట్లు కూడా జారీచేస్తారు. కాని కరోనా పుణ్యమా అని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) పోటీలు నిలిచిపోయాయి.

సత్తాచాటుతున్న గురుకుల విద్యార్థులు

ఓవైపు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు క్రీడాపోటీలకు దూరమవుతుండగా గురుకుల విద్యార్థులు మాత్రం వారి వారి సొసైటీలు నిర్వహిస్తున్న జోనల్ పోటీల్లో పాల్గొని సత్తాచాటుతున్నారు. ఇటీవల బాన్సువాడ మండలం బోర్లంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన జోనల్ పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు హాజరై సత్తాచాటారు. మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులకు ప్రత్యేకంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నాగారంలో క్రీడాపోటీలు నిర్వహించగా విద్యార్థులు చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు. మండలస్థాయిలో ఎస్‌జీఎఫ్ పోటీలు నిర్వహించకుండానే అధికారులు జిల్లాస్థాయి పోటీలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు పాఠశాల, మండల స్థాయిలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



కబడ్డీ ఆడుతున్న గురుకుల విద్యార్థులు(ఫైల్)

ముందుకు రాని దాతలు

గతంలో ఎస్‌జీఎఫ్ పోటీలతో సంబంధం లేకుండా మండల స్థాయిలో పాఠశాల విద్యార్థులకు దాతల సహకారంతో క్రీడాపోటీలు నిర్వహించేవారు. దీనికోసం ఆయా మండలాల ఎంఈవోలు, ప్రజాప్రతినిధులు బాధ్యతగా తీసుకుని టోర్నమెంట్‌ను విజయవంతం చేసేవారు. ప్రస్తుతం మండలస్థాయిలో పాఠశాల విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ప్రతిభ కల్గిన విద్యార్థులు బయటపడటం లేదు. పలు చోట్ల అసోసియేషన్‌లు, ఫౌండేషన్‌లు, స్మారక పోటీలు తప్ప పెద్దమొత్తంలో విద్యార్థుల భాగస్వామ్యం ఉండే పోటీలు కరువయ్యాయి.

కబ్జా భూమిపై చర్యలు తీసుకోవాలి

- అసైన్డు భూమి కబ్జా చేశారని సర్పంచ్‌పై వీడీసీ ఆరోపణ
- ఆ భూములను స్వాధీనం చేసుకుని గ్రామాభివృద్ధికి వినియోగించాలని డిమాండ్

రాజంపేట : శివాయిపల్లిలో సర్వే నెంబర్-566లో రెండు ఎకరాల అసైన్డు భూమిని సర్పంచ్ విఠల్‌రెడ్డి కబ్జా చేశారని, దీనిని అధికారులు అడ్డుకోవాలని వీడీసీ, గ్రామపెద్దలు ఆదివారం డిమాండ్ చేశారు. గ్రామ పరిధిలోని ప్రకృతి వనం, డంపింగ్‌యార్డులను ఆనుకొని ఉన్న అసైన్డు, పట్టా భూమిని ఆక్రమించుకోవాలని సర్పంచ్ యత్నిస్తున్నట్లు వారు ఆరోపించారు. సర్వే నెంబరు-566లో సుమారు 183 ఎకరాల ప్రభుత్వ అసైన్డు భూమి, పట్టా భూమి ఉందని తెలిపారు. ఇటీవల కొంత మంది దొంగ పాస్‌బుక్‌లు సృష్టించి కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సర్పంచ్ కబ్జా విషయం ఇదివరకు తహసీల్దార్, ఆర్డీవోల దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విచారణ చేపట్టి కబ్జాకు గురైన భూమిని గ్రామాభివృద్ధికి వినియోగించాలని వారు డిమాండ్ చేశారు. వీడీసీ అధ్యక్షుడు పి.భూషణం, ఉపాధ్యక్షుడు వి. అశోక్, కార్యదర్శి ఉదగిరి రవీందర్ రావు, కోశాధికారి లక్ష్మారెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



కబ్జా చేసిన భూమి వద్ద శివాయిపల్లి వీడీసీ సభ్యులు, గ్రామస్తులు

వైభవంగా అయ్యప్ప స్వామి శోభాయాత్ర



సదాశివనగర్‌లో నిర్వహిస్తున్న శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న మాలధారులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో మహాపడి పూజ కార్యక్రమంలో భాగంగా ఆదివారం అయ్యప్ప స్వామి విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి శోభాయాత్ర నిర్వహించారు. అయ్యప్ప ఆలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర అంబేడ్కర్ చౌరస్తా వరకు కొనసాగింది. అయ్యప్ప నామస్మరణతో గ్రామం మారుమ్రోగింది. సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ వంకాయల రవి, ఎంపీటీసీ బీరయ్య పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి పట్టణ అయ్యప్ప ఆలయంలో..

ఎల్లారెడ్డి: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో ఆదివారం అన్నదానం(భిక్ష) ఏర్పాటు చేశారు. స్వామి వారికి ప్రత్యేకంగా పూజలు చేసిన అనంతరం ఆంజనేయులు స్వామి తోటి స్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గురుస్వాములు శ్రీనివాస్, నాగేష్, రాములు, తదితరులున్నారు.

ముగిసిన అయ్యప్ప మండల పూజ ఉత్సవాలు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి అయ్యప్పస్వామి దేవాలయం 34వ మండల పూజ మూడు రోజుల ఉత్సవాలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ఆదివారం ఉదయం స్వామివారి తిరువాభరణాల పెట్టెలను ఊరేగించారు. అయ్యప్ప మాలధారులు భక్తిశ్రద్ధలతో పాటలు పాడుతూ సింగారి మేళంతో నృత్యాలు చేశారు. ఆలయ కార్యనిర్వాహక అధ్యక్షుడు పట్నం రమేష్, ప్రధాన కార్యదర్శి గొనే శ్రీనివాస్, అన్నదాన సత్రం అధ్యక్షుడు నస్కంటి శ్రీనివాస్, ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డి అయ్యప్ప ఆలయంలో అన్నదానం



తిరువాభరణాల పెట్టెల ఊరేగింపు

నూతన సంవత్సర వేడుకలు



దోమకొండలోని ప్రైవేట్ విద్యాసంస్థలో న్యూఇయర్ వేడుకల్లో చిన్నారులు



ఎల్లారెడ్డిలో వెలసిన రంగుల దుకాణాలు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లా వ్యాప్తంగా ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు ఆదివారం అర్ధరాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పెద్దలు, యువతీయువకులు కేకులు కోసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వీధుల్లో వాహనాలపై తిరుగుతూ హ్యాపీ న్యూఇయర్ అంటూ పెద్ద ఎత్తున నినదించారు. బాణాసంచా కాల్చుతూ సంబురాలు చేసుకున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేశారు. పలు చోట్ల కొత్తగా రంగుల దుకాణాలు వెలిశాయి. ఈ సందర్భంగా ఆలయాలు కూడా సుందరంగా ముస్తాబయ్యాయి.



భిక్కనూరులో ముస్తాబైన వేంకటేశ్వరాలయం




దోమకొండలోని చాముండేశ్వరి ఆలయం

ఘనంగా రాములోరి అక్షింతల శోభాయాత్ర




దేవునిపల్లిలో అక్షింతలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్తులు

అయోధ్య రాములోరి అక్షింతల శోభాయాత్ర జిల్లాలో ఆదివారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. అక్షింతలతో కూడిన కలశాలకు ఊరేగింపు నిర్వహించారు. శోభాయాత్రలో ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్, అయ్యప్పస్వాములు, బీజేపీ నాయకులు, శ్రీరామ, హనుమాన్ భక్తులు, స్థానిక గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. యువకులు నృత్యాలు చేస్తూ జైశ్రీరామ్, రామ లక్ష్మణ జానకి జై బోలో హనుమాన్‌కీ అంటూ భక్తులు హోరెత్తించారు. – సాక్షి నెట్‌వర్క్



సుల్తాన్‌పేట్‌లో..



మద్నూర్‌లో..

పద్మశాలి నూతన కార్యవర్గం ఎన్నిక

రామారెడ్డి(ఎల్లారెడ్డి): రామారెడ్డి పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా దుదుక నరేందర్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, సెక్రెటరీగా సప్పని రవి, కోశాధికారిగా భూపతి శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.

జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా చింతల శంకర్

ఎల్లారెడ్డి: జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా చింతల శంకర్‌ను నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య ఉత్తర్వులు జారీ చేసినట్లు బీసీ సంఘం నాయకులు ఆదివారం తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా ఉన్న కాముని సుదర్శన్‌ను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులు కావడంతో ఆయన స్థానంలో శంకర్‌ను నియమించారు

శుభాకాంక్షలు

పిట్లం(జుక్కల్): యువజన కాంగ్రెస్ జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఇంచార్జిగా యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామర్తి గోపిని నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు బీవీ శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు శివసేనా రెడ్డి, రాష్ట్ర ఇంచార్జ్ సురభి ద్వివేది శనివారం గాంధీభవన్‌లో ప్రకటించారు. దీంతో జుక్కల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఇమ్రోజ్ ఆదివారం రామర్తి గోపిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రామర్తి గోపి మాట్లాడుతూ..లోక్‌సభ ఎన్నికల్లో కష్టపడి జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి విజయం కోసం యువజన కాంగ్రెస్ పనిచేయాలని సూచించారు.

ఇంటింటా సర్వే



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని 41 గ్రామ పంచాయతీల్లో భారత్ గ్యాస్ వినియోగదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. వినియోగదారులు ఎలాంటి సమస్యలున్నా అధికారులను అడిగి తెలుసుకోవాలన్నారు. గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరుతుందన్నారు.

అన్నారంలో గట్టు మల్లన్నకు బోనాలు

రామారెడ్డి (ఎల్లారెడ్డి): మండలంలోని అన్నారం గ్రామంలో ఆదివారం గట్టు మల్లన్న జాతర ఘనంగా నిర్వహించారు. జాతరలో భాగంగా గట్టు మల్లన్నకు బోనాలు, గండ దీపాలను బండ్లపై ఊరేగింపు నిర్వహించారు. జాతరలో అన్నారం గ్రామస్తులు భారీగా పాల్గొన్నారు. బోనాల సమర్పించి, దండ దీపాలను వెలిగించారు.



పాత చీరలే శ్రీరామ రక్ష

- రైతులపై అదనపు భారం
- అటవీ జంతువుల నుంచి కాపాడుకోవడానికి ప్రయత్నం

తాడ్వాయి/మద్నూర్(ఎల్లారెడ్డి): రబీ సీజన్‌లో వేసిన పంటలను కాపాడుకోవడానికి రైతులు పాత చీరలను వాడుతున్నారు. చేతికి వచ్చిన పంటలను అడవి జంతువులు దాడి చేసి చేసి ధ్వంసం చేస్తాయని ముందు జాగ్రత్తగా పంటల చుట్టూ పాత చీరలను కడుతున్నారు. రబీ సీజన్‌లో మొక్క జొన్న, సోయా, చెరుకు, శనగ, జొన్న తదితర పంటలను కోతులు, అడవి పందులు గుంపులు గుంపులుగా వచ్చి ధ్వంసం చేస్తున్నాయి. చేతికి వచ్చే సమయంలో నాశనం చేయడంతో రైతులు దిక్కులేని పరిస్థితిలో ఉంటున్నారు.

గత్యంతరం లేక ఉన్న పంటలనైనా కాపాడుకుందామని కామారెడ్డి, ఎల్లారెడ్డి, పిట్లం, బాన్సువాడ, గాంధారి, ఇందల్‌వాయి తదితర మండల కేంద్రాలలో జరిగే సంతలకు వెళ్లి పాత చీరలను కొనుగోలు చేసుకుంటున్నారు. జంతువుల నుంచే కాకుండా పక్షుల నుంచి కూడా రక్షించుకోవచ్చని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకొని అటవీ జంతువుల నుంచి పంటలను కాపాడేలా చర్యలు తీసుకోవాలని వివిధగ్రామాల రైతులు కోరుతున్నారు.



నందివాడ శివారులో శనగ పంట చుట్టూ చీరలు



మద్నూర్ శివారులో ..

ప్రమాదకర గుంతల పూడ్చివేత



'రోడ్డుపై గుంతలతో ప్రమాదం' అనే శీర్షికన గత నెల 11న వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. మత్తమాల గ్రామ శివారులో ప్రమాదకరంగా ఉన్న గుంతను అధికారులు సిబ్బందితో మట్టిని పోయించి పూడ్చి వేశారు. సాక్షిలో వచ్చిన కథనం ఆధారంగా అధికారులు చర్యలు తీసుకోవడం పట్ల స్థానికులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

– ఎల్లారెడ్డిరూరల్ (ఎల్లారెడ్డి)

సాక్షి ఎఫెక్ట్..

వృథాగా మిషన్ భగీరథ నీరు

- పట్టించుకోని అధికారులు



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని చిన్న దేవిసింగ్ తండాలో మిషన్ భగీరథ నీరు వృథాగా పోతోంది. మిషన్ భగీరథ సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రతి రోజు నీళ్ల ట్యాంకు నిండి పొర్లిపోతున్నాయి. ఇంకా కొన్ని గ్రామాలకు నీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఇలా నిర్లక్ష్యంగా నీరు పోతున్నా పట్టించుకోవడం లేదు. ప్రతి రోజు ఇలాగే నీరు వృథాగా పోతాయని తండావాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీరు వృథాపోకుండా చూడాలని కోరుతున్నారు.